క్లుప్తంగా

ఆటో డ్రైవర్లకు దుస్తుల అందజేత



మైలవరం: మొర్సుమల్లి గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు మాడపాటి శ్రీనివాసరావు సౌజన్యంతో అదే గ్రామానికి చెందిన 25 మంది ఆటో డ్రైవర్లకు ఆదివారం ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ ద్వారా యూనిఫామ్ దుస్తులు అందజేశారు. మైలవరంలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ పుట్టినరోజు వేడుకలు పురస్కరించుకుని ఆటో డ్రైవర్లకు దుస్తులు అందజేసినట్లు మాడపాటి శ్రీనివాసరావు తెలిపారు.

ప్రకృతి వ్యవసాయ రైతులకు సత్కారం



ఈలప్రోలు(ఇబ్రహీంపట్నం): ఈలప్రోలు గ్రామంలో ప్రకృతి ద్వారా సేంద్రియ వ్యవసాయం చేస్తున్న రైతులను కిసాన్ మోర్చా ఆ. ద్వర్యంలో ఆదివారం సత్కరించారు. కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు రేగళ్ల రఘునాథరెడ్డి మాట్లాడుతూ పూర్వం సేంద్రియ వ్యవసాయంతో పండించిన పంటలు కుటుంబ ఆరోగ్యాన్ని పెంచేవన్నారు. ప్రస్తుతం పాశ్చాత్య పోకడలతో రసాయన ఎరువుల వ్యవసాయం అలవాటు అయినప్పటికీ గ్రామంలో బత్తుల శ్రీనివాసరావు, కొండెపాటి పూర్ణచంద్రరావు సేంద్రీయ వ్యవసాయం చేయడం అభినందనీయమన్నారు.

కమ్యూనిస్టు యోధుడు చంద్రకు ఘన నివాళి



తిరువూరు: కమ్యూనిస్టు ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన చంద్ర రాజేశ్వరరావు వర్ధంతి కార్యక్రమాన్ని స్థానిక సీపీఐ కార్యాలయంలో ఆదివారం నిర్వహించారు. కమ్యూనిజం వ్యాప్తికి చంద్ర చేసిన కృషిని పార్టీ మాజీ జిల్లా కార్యదర్శి పసుపులేటి వెంకయ్య వివరించారు. చంద్ర చిత్రపటానికి పార్టీ పట్టణ, నియోజకవర్గ కార్యదర్శులు కొత్తపల్లి సుందరరావు, తూము కృష్ణయ్య, అనుబంధ సంఘాల బాధ్యులు షేక్ నాగులుమీరా, చిలుకూరి వెంకటేశ్వరరావు, అశోక్, ఉదయ్, ముత్తయ్య, సుబానీ పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

నైతిక విలువతో కూడిన విద్య అందించాలి



ఇబ్రహీంపట్నం: పాఠశాల స్థాయిలోనే క్రమశిక్షణ, నైతిక విలువలతో కూడిన విద్య విద్యార్థులకు అందించాలని ఎంఈఓ సీహెచ్ పుష్పలత అన్నారు. స్థానిక మెరీడియన్ పాఠశాలలో గ్రాడ్యుయేషన్ డే వేడుకలు కరస్పాండెంట్ పి.శ్రీధర్ రెడ్డి ఆధ్వర్యంలో శనివారం రాత్రి నిర్వహించారు. నైపుణ్యంతో కూడిన విద్య అందించి వారి భవిష్యత్‌కు బాటలు వేయాలని ఎంఈఓ సూచించారు. విద్యార్థులకు ప్రశంసా పత్రాలు, మెమోంటోలు అందజేశారు.

కళావేదికపై కూచిపూడి నృత్య ప్రదర్శన



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ధర్మపథం కార్యక్రమంలో భాగంగా ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలో హైదరాబాద్ మనికొండకు చెందిన శ్రీకళాకేంద్రానికి చెందిన పలువురు నృత్యకారులు ప్రదర్శించిన కూచిపూడి నృత్యం ఆకట్టుకుంది. అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని కళావేదికపై జక్కంపూడి కీర్తి, పెదిరెడ్ల లిఖిత, షాన్విత, వాసవిశ్రీ, అనగాశ్రీ, భవ్యలు పలు కీర్తనలకు చక్కటి హావభావాలతో నృత్య ప్రదర్శన ఇచ్చారు. అమ్మవారి పంచహారతుల అనంతరం నిర్వహించిన కూచిపూడి నృత్య ప్రదర్శనను భక్తులు ఆసక్తిగా వీక్షించారు. అనంతరం అమ్మవారి దర్శనం కల్పించి తీర్థప్రసాదాలను అందజేశారు.

భక్తిశ్రద్ధలతో ఈస్టర్



వెలగలగూడెంలో ఈస్టర్ సందేశాన్ని ఇస్తున్న ఫాదర్ దానియేలు

ఇబ్రహీంపట్నం: మండలంలోని క్రైస్తవులు ఈస్టర్ పండగను ఆదివారం భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఏసుక్రీస్తు సిలువపై మరణించి మూడోరోజు సజీవంగా లేచిన రోజును క్రీస్తు పునరుత్థానంగా భావించి ఆర్సీఎం, సీఎస్ఐ, పెంతికోస్తు, ఇతర సంస్థల చర్చీల్లో తెల్లవారుజాము నుంచి ప్రార్థనలు నిర్వహించారు.

మైలవరంలో..

మైలవరం: మైలవరంలో ఈస్టర్ పండగ సందర్భంగా క్రైస్తవులు ఆదివారం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. మైలవరం ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ క్రిస్టియన్లకు శుభాకాంక్షలు తెలిపారు.

రెడ్డిగూడెంలో..

రెడ్డిగూడెం: సర్వమానవాళి కోసం ఏసుక్రీస్తు శిలువలో మరణించి మూడో రోజైన ఈస్టర్ పర్వదినం రోజున లేచారని వెలగలగూడెం ఆర్సీఎం విచారణకర్తలు రెవరెండ్ ఫాదర్ టి. దానియేలు పేర్కొన్నారు. మండలంలోని పలు గ్రామాల్లో ఈస్టర్‌ను భక్తి శ్రద్ధలతో ఆదివారం జరుపుకున్నారు. రెడ్డిగూడెంలోని సీఎస్ఐ చర్చి, వెలగలగూడెం అర్సీఎం చర్చిలలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఆర్సీఎం చర్చిలో అర్ధరాత్రి దివ్యపూజ బలి భక్తి శ్రద్ధలతో నిర్వహించారు.

తిరువూరులో..

తిరువూరు: సర్వమానవాళిని పాపవిముక్తుల్ని చేయడానికి శిలువపై మరణించిన ఏసుక్రీస్తు మూడవరోజు తిరిగి లేచిన పవిత్రదినం ఈస్టర్ పండుగ జరుపుకుంటామని తిరువూరు ఆర్సీఎం చర్చి ఫాదర్ రెవరెండ్ విజయకుమార్ అన్నారు. ఆదివారం ఈస్టర్ పర్వదిన సందర్భంగా చర్చిలో వాక్యోపదేశం చేశారు. పాస్కా జాగరణ అనంతరం దివ్య బలిపూజ, దివ్య సత్ప్రసాద ఆరాధనలను ఫాదర్ విజయకుమార్ నిర్వహించారు. క్రీస్తు బోధనలను ప్రతి ఒక్కరూ అనుసరించాలని సూచించారు. పట్టణంలోని సీఎస్ఐ, క్రాస్ బాపిస్టు, తెలుగు బాప్టిస్టు, కల్వరి, బేల్ ఏతేల్ తదితర చర్చిలలో ఈస్టర్ ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.



తిరువూరు ఆర్సీఎం చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు

నూతన వస్త్రాల బహూకరణ

రెడ్డిగూడెం: రెడ్డిగూడెం మండలం కుదప గ్రామంలో ఈస్టర్ పర్వదినాన్ని పురస్కరించుకుని సీఎస్ఐ చర్చి నందు వితంతువులకు నూతన వస్త్రాలను ఆదివారం బహూకరించారు. మైలవరం క్రిస్టియన్ మైనార్టీ అధ్యక్షుడు, వసంత ఫౌండేషన్ చైర్మన్ బుర్రి ప్రతాప్ అందజేసిన వస్త్రాలను సీఎస్ఐ చర్చి పాస్టర్, గ్రామ పెద్దల సహకారంతో పంపిణీ చేశారు.

ఈస్టర్ ప్రార్థనల్లో పాల్గొన్న ఎమ్మెల్యే

నూజివీడు: పట్టణంలోని బేతెల్ చర్చిలో ఆదివారం నిర్వహించిన ఈస్టర్ వేడుకల్లో ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు పాల్గొన్నారు. ఈస్టర్ సందర్భంగా చర్చిలో ఫాదర్లు నిర్వహించిన ప్రార్థనల్లో పాలుపంచుకున్నారు. అనంతరం చర్చిలో ఏర్పాటు చేసిన కేక్‌ను ఎమ్మెల్యే కట్ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఏసుక్రీస్తు పునరుత్థానం క్రైస్తవ చరిత్రలో కీలకమైనదన్నారు. కార్యక్రమంలో ఫాదర్ రాచమళ్ల జోనాథన్, వైఎస్సార్ సీపీ క్రిస్టియన్ మైనారిటీ విభాగం ఏలూరు జిల్లా అధ్యక్షుడు పిళ్లా చరణ్, కృష్ణా జిల్లా జెడ్పీ వైస్ చైర్మన్ గుడిమళ్ల కృష్ణంరాజు, వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షులు శీలం రాము, కౌన్సిలర్ కొమ్ము వెంకటేశ్వరరావు, పులపాక ప్రియాంక పాల్గొన్నారు.

చాట్రాయిలో..

చాట్రాయి: మానవాళి పాప పరిహారం కోసం శిలువపై మరణించి ప్రభువైన ఏసుక్రీస్తు తిరిగి మూడో రోజు సమాధి నుంచి లేచిన రోజున జరుపుకునే పునరుత్థాన పండుగను క్రైస్తవులు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శనివారం తెల్లవారుఝాము నుంచి ఆదివారం ఉదయం వరకు ఆయా చర్చిల్లో ప్రార్థనలు చేశారు.

ఆగిరిపల్లిలో..

ఆగిరిపల్లి: మండలంలోని క్రైస్తవులు ఈస్టర్ పండగను భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. కనసానపల్లి పరిశుద్ధ పౌలు సీఎస్ఐ చర్చిలో పాస్టర్ ఐజక్ జాన్ ఆధ్వర్యంలో ఈస్టర్ ప్రార్థనలను నిర్వహించారు.

ముసునూరులో..

ముసునూరు: మండల వ్యాప్తంగా క్రైస్తవులు క్రీస్తు పునరుత్థాన వేడుకలను ఆదివారం నిర్వహించారు. శనివారం అర్ధరాత్రి నుంచే ఉజ్జీవ కీర్తనలు, బైబిలు పఠనాలు, పరస్పర ఆలింగనాలతో ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకుంటూ, ప్రేమవిందులతో రోజంతా ఉల్లాసంగా, ఉత్సాహంగా చర్చిలలో గడిపారు. రమణక్కపేట, ముసునూరు విచారణల ఫాదర్లు సాల్మన్‌రాజ్, జేమ్స్ దేవసహాయం ఈస్టర్ ప్రత్యేక దివ్య బలి పూజను సమర్పించి, ప్రజలందరికీ ఈస్టర్ శుభాకాంక్షలు తెలిపారు. మండల పాస్టర్స్ ఫెలోషిప్, న్యూపాస్టర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ల అధినేతలు కంబాల రాంబాబు, టి.రూబేన్ వరకుమార్, పాస్టర్లు, వివిధ సంఘ కాపరుల ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.



నూజివీడు బేతెల్ చర్చిలో కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు



రెడ్డిగూడెంలో నూతన వస్త్రాలను అందజేస్తున్న బుర్రి ప్రతాప్

ఘనంగా ఎమ్మెల్యే వసంత పుట్టినరోజు వేడుకలు



మైలవరం వైఎస్సార్ సీపీ కార్యాలయంలో కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే వసంత



ఐతవరంలో కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్

మైలవరం: మైలవరం ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ పుట్టిన రోజు వేడుకలు స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, వైఎస్సార్ సీపీ శ్రేణులు ఆదివారం ఘనంగా నిర్వహించారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల వద్ద నుంచి ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు జాతీయ రహదారిపై భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. నియోజవర్గ వ్యాప్తంగా పలు గ్రామాల నుంచి వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ప్రజాప్రతినిధులు ఈ వేడుకల్లో పాల్గొన్నారు. స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ భారీ కేక్ కట్ చేసి అభిమానులుతో సంతోషం పంచుకున్నారు. పార్టీలకు అతీతంగా నాయకులు, ప్రజాప్రతినిధులు, అధికారులు, అభిమానులు ఎమ్మెల్యేకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

ఇబ్రహీంపట్నంలో..

ఇబ్రహీంపట్నం: ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ పుట్టినరోజు సందర్భంగా ఐతవరంలోని స్వగృహంలో ఎమ్మెల్యే వసంత ఆయన సతీమణి శిరీష కలిసి పూజలు నిర్వహించి అనంతరం కేక్ కట్ చేశారు. దొనబండ నుంచి భారీ బైక్‌ర్యాలీ నిర్వహించారు. ఎమ్మెల్యే వసంత కుమారుడు ధీమంత్‌సాయి, జెడ్పీ వైస్ చైర్మన్ గరికపాటి శ్రీదేవి, ఎంపీపీ పాలడుగు జోత్స్న, ఎంపీటీసీ సభ్యులు కొమ్మూరి రామకోటేశ్వరరావు పాల్గొన్నారు.

జి.కొండూరులో..

జి.కొండూరు: మైలవరం ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ పుట్టిన రోజు వేడుకలను వైఎస్సార్ సీపీ శ్రేణులు జి.కొండూరులో ఆదివారం ఘనంగా జరిపారు. జి.కొండూరు బైపాస్‌రోడ్డు వై జంక్షన్ వద్ద ఎమ్మెల్యే వసంతకు ఘన స్వాగతం పలికిన పార్టీ శ్రేణులు, గజమాలతో సత్కరించారు. ఎమ్మెల్యే చేత కేకును కట్ చేయించారు. అనంతరం ర్యాలీగా వెళ్లిన ఎమ్మెల్యే, వెంకటాపురంలో దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి పులమాలలు వేసి నివాళులర్పించారు.



ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ పుట్టినరోజు సందర్భంగా మైలవరంలో నిర్వహించిన బైక్ ర్యాలీ

రామాలయంలో అన్నసమారాధన

కృష్ణలంక(విజయవాడతూర్పు): శ్రీరామనవమి వేడుకల్లో భాగంగా కృష్ణలంక సబ్‌వే సమీపంలోని రామాలయంలో ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం అన్నసమారాధన కార్యక్రమం నిర్వహించారు. తొలుత ఆలయ అర్చకులు సీతారామచంద్రమూర్తికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. అనంతరం నిర్వహించిన అన్నసమారాధన కార్యక్రమంలో భక్తులు విశేషంగా పాల్గొని అన్నప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమాన్ని ఆలయ కమిటీ సభ్యులు పర్యవేక్షించారు.

'జగనన్నే మా భవిష్యత్'కు ఆదరణ

నూజివీడు: పట్టణంలో ఎక్కడికి వెళ్లినా ప్రతి ఇంటా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాల మాటే వినిపిస్తోందని వైఎస్సార్ సీపీ క్రిస్టియన్ మైనారిటీ విభాగం ఏలూరు జిల్లా అధ్యక్షుడు పిళ్లా చరణ్ అన్నారు. పట్టణంలోని 21వ వార్డులో నిర్వహిస్తున్న జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమంలో ఆదివారం ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఇంటింటికీ తిరుగుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాలను స్థానికులకు వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదల పక్షపాతి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని పేర్కొన్నారు. పేదవర్గాల కోసం సంక్షేమ పథకాలు అమలు చేస్తున్న దేశంలోనే ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని, రాబోయే ఎన్నికల్లో పేదవర్గాలు జగన్‌కు అండగా ఉండాలన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకుడు కళ్లేపల్లి ఆదినారాయణ పాల్గొన్నారు.

చాట్రాయిలో..

చాట్రాయి: మండలంలోని అన్ని గ్రామాల్లో ఆదివారం జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమాన్ని వైఎస్సార్ సీపీ నాయకులు ముమ్మరంగా నిర్వహించారు. బూరుగుగూడెంలో ఎంపీపీ లంకా నిర్మల, పోలవరంలో జెడ్పీటీసీ సభ్యురాలు చెలికాని అనూషా, పీఏసీఎస్ చైర్మన్ చెలికాని బాబ్జీ, నరసింహారావుపాలెంలో గ్రామంలో మండల సచివాయాల కన్వీనర్ పుచ్చకాయల సుబ్బారెడ్డి, గ్రామ సర్పంచ్ విస్సంపల్లి ప్రశాంతి, మర్లపాలెంలో మద్దిరామయ్య, శ్రీను పాల్గొన్నారు.

ఆగిరిపల్లిలో..

ఆగిరిపల్లి: 'జగనన్నే మా భవిష్యత్తు, మా నమ్మకం నువ్వే జగన్' కార్యక్రమం మండలంలో ముమ్మరంగా సాగుతోంది. మండల పరిధిలోని చిన్న ఆగిరిపల్లిలో మండల వైఎస్సార్ సీపీ కన్వీనర్ పల్లగాని నరసింహారావు, ఆధ్వర్యంలో ఆదివారం ప్రతి గడపకూ వెళ్లి రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. ఈదులగూడెంలో పీఏసీఎస్ చైర్‌పర్సన్ ఈలప్రోలు వెంకట సుబ్బయ్య ఆధ్వర్యంలో మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమాన్ని నిర్వహించారు.



నూజివీడులో జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు

గంపలగూడెంలో..

గంపలగూడెం: జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమాన్ని గంపలగూడెం మండలంలోని పలు సచివాలయాల పరిధిలో ఆదివారం వైఎస్సార్ సీపీ శ్రేణులు ఉత్సాహంగా నిర్వహించారు. తునికిపాడులో వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు వెంకటేశ్వరరావు, ఊటుకూరులో వైఎస్సార్ సీపీ జిల్లా కమిటీ సభ్యులు ఆలపాటి ఉమా, ఎంపీటీసీ సభ్యురాలు ఆలపాటి సునీత పాల్గొన్నారు.

పార్టీలకతీతంగా సంక్షేమ పథకాలు

విస్సన్నపేట: అర్హతే ప్రామాణికంగా పార్టీలకతీతంగా సంక్షేమ పథకాలను అమలు చేయటం జరుగుతుందని ఎంపీపీ పిల్లి మెర్సీవనజాక్షి అన్నారు.స్థానిక సచివాలయం-3 పరిధిలో 13వ వార్డులో జగనన్నే మా భవిష్యత్తు, మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమాన్ని ఎంపీపీ ఆదివారం ప్రారంభించారు. సర్పంచ్ పి వెంకటేశ్వరరావు, ఎంపీటీసీ సభ్యుడు తిరుపతిరావు, గ్రామపార్టీ అధ్యక్షుడు కాలీషా పాల్గొన్నారు.



విస్సన్నపేటలో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం



బూరుగుగూడెంలో కరపత్రాలు పంపిణీ చేస్తున్న ఎంపీపీ లంకా నిర్మల

ముసునూరులో..

ముసునూరు: మండల వ్యాప్తంగా గుళ్లపూడి శివారు గుడిపాడు, అక్కిరెడ్డిగూడెం గ్రామాల్లో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమాన్ని ఆదివారం ప్రారంభించారు. జెడ్పీటీసీ సభ్యుడు, సచివాలయాల కన్వీనర్ వరికూటి ప్రతాప్ కార్యక్రమ విధి విధానాలపై లోపూడి, గుడిపాడు, గోపవరం, కాట్రేనిపాడు, అక్కిరెడ్డిగూడెం గ్రామాల్లో సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, గ్రామ పెద్దలు, కమిటీలకు దిశానిర్దేశం చేశారు. సాయంత్రం నుంచి గుడిపాడులో గ్రామ సర్పంచ్, ఉపసర్పంచ్‌లు ఆర్ శ్రీదేవి శ్రీనివాస్, పద్మజా రాంబాబుల ఆధ్వర్యంలో సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు ఇంటింటికీ వెళ్లి, మా నమ్మకం నువ్వే జగనన్న కరపత్రాలను పంపిణీ చేశారు. అక్కిరెడ్డిగూడెంలో ఎంపీటీసీ సభ్యుడు వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో మాజీ ఎంపీటీసీ సీతారామయ్య తదితరులు ఇంటింటికీ తిరుగుతూ జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమాన్ని నిర్వహించారు.

'జగనన్నే మా భవిష్యత్తు'ను విజయవంతం చేయాలి

మైలవరం: జగనన్నే మా భవిష్యత్తు, మా నమ్మకం నువ్వే జగనన్న కార్యక్రమం విజయవంతంగా నిర్వహించాలని ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ వలంటీర్‌లు, గృహ సారథులకు సూచించారు. మైలవరంలోని ఆయన కార్యాలయంలో ఆదివారం మాట్లాడుతూ ప్రతి ఒక క్లస్టర్ పరిధిలో ఉన్న వలంటీర్‌లు గృహ సారథులతో కలిసి తప్పని సరిగా పాల్గొనాలన్నారు. డోర్, మొబైల్ స్టిక్కర్‌లను ఇంటి యజమానుల అనుమతితో వారి ఫోన్, డోర్‌పైన అంటించాలని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనకు మద్దతు తెలిపేందుకు 82960 82960కు మిస్డ్ కాల్ ఇవ్వాలని నివాసితులను అభ్యర్థించాలన్నారు.

అగ్ని ప్రమాద బాధితులకు సాయం



సాయం అందజేస్తున్న జెడ్పీటీసీ సభ్యుడు తదితరులు

ముసునూరు: ఇటీవల అగ్ని ప్రమాదంలో సర్వం కోల్పోయిన బాధితులకు వైఎస్సార్ సీపీ నేతలు ఆపన్నహస్తం అందించారు. మండలంలోని చెక్కపల్లికి చెందిన అగ్ని బాధిత కుటుంబ సభ్యులు, మానసిక దివ్యాంగులైన అన్నాచెల్లెలు కొయ్యూరి రవికుమార్, బసవపూర్ణకు ఉపసర్పంచ్ పద్మజా దేవేంద్ర 25 కేజీల బియ్యం, జెడ్పీటీసీ సభ్యుడు వరికూటి ప్రతాప్ నూతన వస్త్రాలు, గ్రామ సచివాలయ కన్వీనర్ వెంకటేశ్వరరావు నిత్యావసరాల కోసం రూ.1,000ను ఆదివారం అందజేశారు.

నేడు 'స్పందన'

గంపలగూడెం: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ వై పిచ్చిరెడ్డి తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు నిర్వహించే కార్యక్రమంలో వివిధశాఖల అధికారులు పాల్గొంటారని పేర్కొన్నారు.

సబ్ కలెక్టర్ కార్యాలయంలో..

నూజివీడు: స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కారం కోసం సోమవారం స్పందన కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు సబ్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు నిర్వహించే ఈ కార్యక్రమంలో ప్రజలు పాల్గొని తమ సమస్యల పరిష్కారం నిమిత్తం అర్జీలను అందజేయాలని పేర్కొన్నారు.

'గుండెపోటు ఆకస్మికంగా రాదు'

పటమట(విజయవాడతూర్పు): గుండెపోటు ఆకస్మికంగా అప్పటికప్పుడు రాదని ప్రముఖ వైద్య నిపుణుడు రమేష్ హాస్పిటల్స్ అధినేత డాక్టర్ రమేష్‌బాబు అన్నారు. రమేష్ హాస్పిటల్స్, ఇండియన్ మెడికల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో తాజ్ వివాంతా హోటల్‌లో వైద్యులకు నిరంతర వైద్య విద్యా కార్యక్రమం ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ.. గుండెపోటుకు కొన్ని సంవత్సరాలకు ముందే బీజం పడుతుందని, అది క్రమేపీ పెరిగి ఆకస్మికంగా గుండెపోటు సంభవిస్తుందని దాన్ని ముందుగానే కనుగనే బాధ్యత ఫ్యామిలీ డాక్టర్లు, కార్డియాలజిస్టులపై ఉందన్నారు. అకస్మాత్తుగా సంభవించే గుండెపోటు మరణాలపై ప్రజలకు అవగాహన కల్పించాలనే ఉద్దేశంతో తాము ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామని చెప్పారు. గుండెపోటుపై ప్రజలు అవగాహన పెంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో రమేష్ హాస్పిటల్స్ భాగస్వామ్య సంస్థ ఆస్టర్ డీఎం హెల్త్ కేర్ ఇండియా హెడ్ డాక్టర్ నితీష్ షెట్టి, ఏపీ సీఈఓ దేవానంద్, రమేష్ హాస్పిటల్స్ చైర్మన్ మద్దిపాటి సీతా రామ్మోహనరావు, మెడికల్ డైరెక్టర్ డాక్టర్ పావులూరి శ్రీనివాసరావు, ఇండియన్ మెడికల్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ రెహమాన్, సెక్రెటరీ డాక్టర్ దుర్గారాణి, మెడికల్ కౌన్సిల్ అబ్జర్వర్ డాక్టర్ సూరపనేని సుధాకర్, డాక్టర్ గుడారు జగదీష్ పాల్గొన్నారు.



సదస్సులో మాట్లాడుతున్న డాక్టర్ రమేష్‌బాబు

నేడు మారెమ్మ అమ్మవారికి పంబల సేవ

విస్సన్నపేట: మండలంలోని పుట్రేల గ్రామంలోని మారెమ్మ అమ్మవారి దేవస్థానంలో అమ్మవారి వార్షిక తిరునాళ్ల సందర్భంగా సోమవారం ఉదయం 10 గంటల నుంచి ఆలయ ప్రాంగణంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ వెంకట సత్య శేష సునీల్ కుమార్ తెలిపారు. అమ్మవారి తిరునాళ్ల ఆఖరి రోజు అమ్మవారికి పంబలసేవ,కార్యక్రమాలు ఉంటాయని ఆలయ ఈఓ వై సీతారామయ్య పేర్కొన్నారు.

మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం

ఊటుకూరు(గంపలగూడెం): ఊటుకూరు ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం సభ్యులైన తమ్మిశెట్టి జమలయ్య మృతి చెందగా సొసైటీ తరుపు మట్టి ఖర్చులకు గాను రూ.10వేలు అందజేశారు. మృతుడి భార్య పిచ్చమ్మకు సంబంధిత మొత్తాన్ని సొసైటీ అధ్యక్షుడు ఆలపాటి ఉమామహేశ్వరరావు అందజేశారు.

కుమారుడి అదృశ్యంపై ఫిర్యాదు

పెనమలూరు: ఇంటి నుంచి బయటకు వెళ్లిన తన కుమారుడు అదృశ్యమయ్యాడని తల్లి ఫిర్యాదు చేయడంతో పోలీసులు ఆదివారం కేసు నమోదు చేశారు. వణుకూరు గ్రామానికి చెందిన కాండ్రు మరియమ్మ కుటుంబం నివసిస్తోంది. ఆమె కుమారుడు కాండ్రు విజయ్ కూలీ పనులు చేస్తుంటాడు. అతను ఈ నెల ఒకటో తేదీన ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. దీంతో మరియమ్మ ఫిర్యాదు చేశారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
తిరువూరు డివిజన్
99510 20399 (తిరువూరు,
99122 20544 (నూజివీడు)
90102 23734 (మైలవరం)
Office mail : sakshiads@gmail.com